

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 24 జూలై 2024



అభివృద్ధికి అండగా..!







- కేంద్ర బడ్జెట్‌పై సానుకూల స్పందన
- కీలక రంగాలకు సాయంపై హర్షం
- సాగుకు ప్రోత్సాహకంగా కేటాయింపులు
- విద్య, వైద్యానికీ అగ్ర ప్రాధాన్యం
- పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జూలై 23:

వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ 3.0 లోక్‌సభలో మంగళవారం ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సర్వత్రా సానుకూల స్పందన వస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి తద్వారా జిల్లా అభివృద్ధికీ ఆసరా లభిస్తుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా విజయనగరం జిల్లాకు ప్రయోజనం కలగనుంది. నిరుపేద, పేద, రైతులు, యువత, మహిళల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేశారు. నిరుద్యోగాన్ని తగ్గించే లక్ష్యంతో స్కిల్ డెవలప్ ట్రైనింగులు, మహిళల పేరిట ఆస్తులు కొనుగోలు చేస్తే స్టాంపు డ్యూటీలో మినహాయింపు ఇచ్చారు. ప్రత్యక్ష పన్నుల విధానంలో చిన్న, చిన్న మార్పులు చేసినప్పటికీ, జీఎస్టీ విధానంలో ఎటువంటి మార్పులు చేయలేదు.

- చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించేందుకు నిర్ణయించారు. ఈ శాఖకు సంబంధించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరం జిల్లా వాసి కావడంతో జిల్లాకు ప్రయోజనం కలిగే అవకాశం వుంది.
- సౌర విద్యుత్‌ని వినియోగించుకునే విధంగా సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించారు. దాదాపు దేశ వ్యాప్తంగా కోటి సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా ముద్ర యోజన పథకం కింద ఇస్తున్న రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. గ్యారెంటీ, థర్డ్‌పార్టీ లేకుండానే ఈ రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు.
- విజయనగరం జిల్లాలో ముద్ర యోజన పథకం కింద చాలా మంది రుణాలు పొంది, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. బడ్జెట్‌లో తాజాగా కేటాయింపులపై నిరుద్యోగ, వృత్తిదారులు, చిన్న వ్యాపారుల నుంచి హర్షం వ్యక్తమౌతున్నది.. గిరిజనుల సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక పథకాన్ని తీసుకువస్తున్నారు.
- దేశవ్యాప్తంగా 63 వేల గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించారు. వెనుకబడిన ప్రాంతంగా వున్న విజయనగరం జిల్లా నుంచి కూడా కొన్ని గిరిజన గ్రామాలు ఈ పథకం కింద ఎంపికయ్యే అవకాశం ఉంది.
- ప్లాస్టిక్ ఉత్పత్తుల రేట్లు పెరగనున్నాయి.. ప్లాస్టిక్ ఉత్పత్తులపై కస్టమ్స్ డ్యూటీని 25 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో పేర్కొన్నారు.. అదే విధంగా కెమికల్స్, పెట్రోకెమికల్స్, పైనా కస్టమ్స్ డ్యూటీని ఇప్పుడున్న 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. ఫెర్టిలైజర్లు, పురుగుల మందుల తయారీలో ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్‌పై కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో వాటిపై ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ విషయానికి వస్తే 2014 నుంచి 2019 వరకూ ఈ ప్యాకేజీ కింద విజయనగరం ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి జరిగింది. 2019 నుంచి 2024లో ఈ ఊసే లేదు.. తాజాగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. మౌలిక సదుపాయాల కల్పనకు, వివిధ అభివృద్ధి పనులకు ఈ నిధులు ఉపయోగించుకోవచ్చునని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఈ అంశం విజయనగరం జిల్లాకు ఎంతో మేలు చేస్తుంది.


ఆర్థిక పురోగతికి దోహదం..



పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడేటట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. గత వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. దీంతో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి పోయింది. పసిపిల్లలాంటి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు నాయుడు ఎనలేని కృషిచేస్తున్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌ను అన్ని తరగతుల వారూ స్వాగతిస్తున్నారు. ముద్రాలోన్లు పెంచటం శుభపరిణామం. ఇక ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి పరుగులు తీస్తుంది. పోలవరం, రాజధాని పనులు వాయువేగంతో జరుగుతాయి.

-మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కేంద్ర బడ్జెట్ అద్భుతం..



సీఎం చంద్రబాబు చొరవతో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించిన కేంద్ర బడ్జెట్ అద్భుతం. ఉత్తరాంధ్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదు. సొంత పనుల కోసమే ఢిల్లీ వెళ్లేవారు. రాజధాని అభివృద్ధి, నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు కేటాయించడం, పోలవరం ప్రాజక్టు పూర్తి అయ్యేవరకు నిధులు కేటాయిస్తామనడం చాలా సంతోషం.

-ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

బడ్జెట్ ప్రతిపాదనలు హర్షణీయం..



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలు చాలా ఆమోదయోగ్యంగా ఉన్నాయి. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం నిధులు ఇస్తామని ప్రకటించడం హర్షనీయం. విజయనగరం జిల్లాకు ఎంతో మేలు జరుగుతుంది. కోస్టల్ కారిడార్‌తో అభివృద్ధి జోరందుకుంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిని నాశనం చేశారు. రాజధాని కోసం రూ.15 వేల కోట్ల నిధులు ఇస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించడం ఆనందదాయకం. వ్యవసాయరంగానికి చేయూతగా కొత్తవంగడాలను పరిచయం చేయాలను కోవడం హర్షణీయం.

-బేబీనాయన, బొబ్బిలి ఎమ్మెల్యే

అభివృద్ధికి నాంది..



ఆంధ్రప్రదేశ్ మున్ముందు మరింత అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో కలిగేలా మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉంది. పోలవరానికి వరాల జల్లు, అమరావతికి నిధులు కేటాయించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలిచ్చిన విజయం వమ్ము కాలేదని మరోసారి రుజువు అయింది. ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ప్రజలు నమ్ముతున్నారు. భవిష్యత్‌లో అభివృద్ధి, సంక్షేమం ఒకే తాటిపై వెళ్తాయి.

-పడాల అరుణ, జనసేన, రాజకీయ వ్యవహారాల సభ్యురాలు

రాష్ట్ర అభివృద్ధికి దోహదం..



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందనడానికి ఈ కేంద్ర బడ్జెట్ ఓ నిదర్శనం. రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించారు. రాజధానికి ఈ ఏడాదికి రూ.15 వేల కోట్లు ఇవ్వడం చంద్రబాబు పాలనా దక్షతకు నిదర్శనం. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సాగు, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు సమ ప్రాధాన్యం ఇవ్వడం హర్షనీయం.

-కిమిడి నాగార్జున, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

సంతోషాన్ని ఇచ్చింది..



లోకసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతోషాన్నిచ్చింది. ఎన్‌డీఏ కూటమి ఎంపీలు ప్రధాని మోదీ అభిమానాన్ని చూరగొన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ఎంపీలు కృషి చేస్తున్నారు. వారికి సీఎం చంద్రబాబు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణానికి ఏకంగా రూ.15 వేల కోట్లు ఒక్క ఏడాదిలో కేటాయించారంటే సాధారణ విషయం కాదు.

-కోళ్ల లలిత కుమారి, శృంగవరపుకోట ఎమ్మెల్యే

అభివృద్ధే లక్ష్యంగా కేటాయింపులు..

కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించారు. రాజధాని అమరావతికి రూ.15 వేలు కోట్లు కేటాయించడం హర్షనీయం. ముఖ్యంగా విద్య, ఉపాధి, రైతులు, మహిళలు, యువత అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం.

-రెడ్డి పావని, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి



అన్ని వర్గాలకు ప్రయోజనకరం..



వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంతో వెనుకబడింది. ఐదేళ్లుగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు కూడా రాలేదు. రాజధాని అమరావతి కూడా నిర్లక్ష్యానికి గురైంది. కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు అమరావతికి కేటాయించడం హర్షనీయం. బడ్జెట్‌లో నిరుపేద, పేద, యువత, రైతులు, మహిళలు తదితర వర్గాల వారికి ప్రయోజనం కలిగించే పథకాలు ప్రకటించారు.

-అదితి గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే

అందరికీ మేలు..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేదిగా ఉంది. ముఖ్యంగా యువత, మహిళలు, రైతుల కోసం బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర రాజధాని అమరావతి కోసం రూ.15 వేలు కోట్లు కేటాయించడం హర్షనీయం. మౌలిక సదుపాయాల కల్పనకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమం కోసం నిధులు కేటాయించారు. ఇందుకు ఎన్‌డీఏ కూటమి ఎంపీలు శ్రమించారు.

-కోండ్రు మురళీమోహన్, రాజాం ఎమ్మెల్యే

సమగ్రమైన బడ్జెట్..



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రూ.48 లక్షల కోట్లతో రూపొందించారు. పేద, రైతులు, మహిళలు, యువత లక్ష్యంగా తీసుకుని అధిక కేటాయింపులకు అవకాశం ఇచ్చారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించారు. దేశ వృద్ధి రేటు 7 శాతం పైనా ఉండాలన్న లక్ష్యంతో బడ్జెట్‌ని రూపొందించినట్లుంది.

-ఈఆర్ సోమయాజులు, సీనియర్ ఆడిటర్

అన్ని వర్గాలకు న్యాయం..



ఆంధ్రప్రదేశ్‌కు, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు బడ్జెట్‌లో ప్రకటించడం ఆనందదాయకం. యువత, మహిళలు, నిరుపేద, రైతులు ఇలా అన్ని వర్గాలకూ కేటాయింపులు పెంచారు. విద్య వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. వెనుకబడిన వర్గాలు, టూరిజం అభివృద్ధి, చెన్నై-విశాఖ కారిడార్ తదితర వాటికి కేటాయింపులు బాగున్నాయి.

-సూరిబాబు, ఉపాధ్యాయ సంఘ నాయకుడు

కూటమి ప్రభుత్వ విజయం..



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి సంతృప్తికర స్థాయిలో నిధులు ప్రకటించడం కూటమి ప్రభుత్వ విజయం. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి ప్రత్యేక ప్రాజెక్టులు, రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణానికి బడ్జెట్‌లో భరోసా కల్పించారు. విశాఖ -చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం ప్రకటించారు. దశలవారీగా నిధులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సానుకూలత తెలపడం శుభ పరిణామం.

-లోకం నాగమాధవి, ఎమ్మెల్యే నెల్లిమర్ల



తంగుడుబిల్లి వద్ద రోడ్డుపై తేలి ఉన్న రాళ్ల పిక్కలు

సగంలో వదిలేశారు

- నిలిచిపోయిన నెల్లిమర్ల-రణస్థలం రోడ్డు పనులు
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- రూ. 11.18 కోట్ల అంచనాతో పనులు
- మార్చితో ముగిసిన ఒప్పందం గడువు

రెండు జిల్లాలతో కనెక్టవిటీ ఉన్న ప్రధాన మార్గమది. వైసీపీ ప్రభుత్వం పుణ్యమాని మధ్యలో ఆగిపోయింది. జనం అవస్థలను ఆ ప్రభుత్వం గాలికి వదిలేసింది. నెల్లిమర్ల నుంచి శ్రీకాకుళం జిల్లా రణస్థలం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును సుమారు పది కిలోమీటర్ల మేర వెడల్పు చేసే పనులకు అప్పట్లో శంకుస్థాపన చేశారు. పైసా బిల్లు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. కొద్ది నెలలుగా ఆ రోడ్డుపై ప్రయాణానికి జనం నరకయాతన పడుతున్నారు.

నెల్లిమర్ల, జూలై 23:

నెల్లిమర్ల నుంచి రణస్థలం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు సుమారు 11.18 కోట్ల అంచనాతో 2021 డిసెంబరులో మొదలయ్యాయి. అయితే గత రెండు సంవత్సరాల్లో కనీసం పైసా కూడా విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ విసిగిపోయాడు. విన్నవించి.. గోడు వినిపించినా పట్టించుకోక పోవడంతో తన వల్ల కాదని పనులను వదిలేశాడు. నెల్లిమర్ల నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరం వరకు రోడ్డుకు ఇరువైపులా రాళ్లతో లేయర్ వేసి ఆపేయడంతో ప్రయాణికులు చాలా అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పది కిలోమీటర్ల మార్గంలో కల్వర్టులను నిర్మించడంతో పాటు వెడల్పు పనులకు సంబంధించి సొంత సొమ్మును కాంట్రాక్టర్ వెచ్చించాడు. ఇందుకు గాను సుమారు రూ.4.32 కోట్లు చెల్లించాల్సి ఉంది. రోడ్డు పనుల ఒప్పంద గడువును పెంచుకుంటూ తమకు రావాల్సిన బిల్లుల కోసం ఇంజినీరింగ్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు. రూ.4.32 కోట్లు చెల్లిస్తేనే మిగిలిన పనులు పూర్తి చేయాలని భావిస్తున్నాడు. తాను అధికారులతో మాట్లాడుకుని ఒప్పంద కాలం గడువును పెంచుకున్న తేదీ కూడా ఈ ఏడాది మార్చి 31తో ముగిసిపోయింది. ఈ పరిస్థితుల్లో రోడ్డు పనులు ముందుకు వెళ్తాయా.? వెళ్లవా? అనేది తెలియడం లేదు. రావాల్సిన బిల్లు కోసం ఆర్అండ్‌బి జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా ఈరోడ్డు పనులు పూర్తయితే కొత్తపేట, గొర్లెపేట, రామతీర్థం, తంగుడుబిల్లి, ఎంబేరయ్యగుళ్ల, సతివాడ గ్రామాల ప్రజలకు సుఖ ప్రయాణానికి వీలు కలుగుతుంది.



గొర్లెపేట వద్ద పూర్తిగా పాడైన రహదారి

ప్రభుత్వానికి నివేదించాం

నెల్లిమర్ల-రణస్థలం రోడ్డులో సుమారు పది కిలోమీటర్ల దూరం వరకు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోవడం వాస్తవమే. బిల్లు చెల్లించక కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి నివేదించాం. పనులు తిరిగి పునః ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

- నందకుమార్, జేఈ, ఆర్అండ్‌బీ

బాలిక కిడ్నాప్

- ఆందోళనలో తల్లిదండ్రులు
- గాలిస్తున్న పోలీసులు



జామి, జూలై 23 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేశారు. ఈ ఘటన జరిగి మూడురోజులైంది. అన్నిచోట్లా గాలించిన తల్లిదండ్రులు ఆచూకీ లేకపోవడంతో కిడ్నాప్‌గా అనుమానం కలిగి తాజాగా పోలీసులను ఆశ్రయించారు.

బాలిక ఎప్పటిలాగే ఆదివారం తల్లితో కలిసి గ్రామంలోనే చర్చికి ప్రార్థనలకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆ రోజంతా ఎదురు చూశారు. చుట్టుపక్కల వారిని వాకాబు చేయగా బాలికను ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తీసుకువెళ్లినట్లు చూశామని చెప్పారు. దీంతో సమీప ప్రాంతాలన్నింటా వెతికారు. బలరాంపురం గ్రామం వద్ద ఉన్న ఒక డిపార్ట్‌మెంట్‌స్టోర్ సీసీ ఫుటేజీని పరిశీలించారు. అందులోనూ ఇద్దరు యువకులు బైక్‌పై తీసుకువెళ్లడం గుర్తించారు. ఘటనపై తల్లిదండ్రులు జామి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ వీరబాబు మాట్లాడుతూ బాలిక తల్లి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని, బాలిక ఆచూకీ కోసం ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి గాలిస్తున్నామని తెలిపారు.

గంజాయి రవాణాపై నిఘా

ముమ్మరంగా తనిఖీలు చేయండి: ఎస్పీ వకుల్‌జిందాల్



డీఎస్పీ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 23: గంజాయి రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ నియంత్రించాలని, గట్టి నిఘా పెట్టాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని శివార్లలో తనిఖీలు ముమ్మరం చేయాలని చెప్పారు. నగరంలోని టూటౌన్, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులతో పాటు స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లోని గదులను తనిఖీ చేశారు. అక్కడున్న వాహనాలపై ఆరా తీశారు. సీజ్ చేసినవి, ఏ కేసుల్లో సీజ్ చేసింది? ఎందుకు స్టేషన్‌లో వున్నాయన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలకు ఆయా కేసుల వివరాలను టాగ్ చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హిస్టరీ షీట్‌లను పరిశీలించి చెడు నడతలో చురుగ్గా వున్న వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. తనిఖీల్లో విజయనగరం డీఎస్పీ గోవిందరావు, సీఐలు కె.రామారావు, డి. వెంకటరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, మురళీ, రాజేష్, తారకేశ్వరరావు, నరేష్, హరిబాబు నాయుడు, నవీన్ పడాల్ ఉన్నారు.

సిబ్బంది కొరత తీరేనా?


నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం

- నెల్లిమర్ల నగర పంచాయతీలో డిప్యుటేషన్ పాలన
- రెండు పోస్టులే రెగ్యులర్
- మిగిలిన వారంతా ఇతర మున్సిపాల్టీల వారే
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తున్నవైనం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నది. అవుట్‌సోర్సింగ్ హవా కొనసాగుతోంది. పాలన అస్తవ్యస్తంగా మారింది. నగర పంచాయతీ ఏర్పడి 11 ఏళ్లు కావస్తున్నా పాలన చేసేందుకు అవసరమైన ఉద్యోగుల నియామకం జరగలేదు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఇతర మున్సిపాల్టీల నుంచి వచ్చిన డిప్యుటేషన్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే కథ నడిపిస్తున్నారు. అసలు ఉద్యోగుల కంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే ఈ నగర పంచాయతీ పాలన నడుస్తోంది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి సర్వీసు నిబంధనలు లేకపోవడం వల్ల పాలన ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఏ శాఖకు ఎవరు బాధ్యత వహిస్తున్నారనే విషయం కూడా ఇక్కడ స్పష్టంగా కనిపించదు. మండల కేంద్రంగా ఉన్న నెల్లిమర్లకు, పక్కనే ఉన్న మరో మేజర్ పంచాయతీ జరజాపుపేటను విలీనం చేసి 2013 మార్చి 21న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నగర పంచాయతీగా మార్పుచేసింది. అయినప్పటికీ అందుకు అవసరమైన సిబ్బందిని నియమించలేదు. ప్రధానంగా ఇంతవరకు ఏ ప్రభుత్వం పోస్టులను కూడా మంజూరు చేయకపోవడం విడ్డూరం. కేవలం నగర పంచాయతీ కమిషనర్ పోస్టును, మేనేజర్ పోస్టును మాత్రమే మంజూరుచేసింది. వీరితో పాటు అవసరమైన కార్యాలయ సిబ్బంది పోస్టులను మంజూరు చేయకపోవడం వల్ల ఇతర మున్సిపాల్టీల నుంచి డెప్యుటేషన్ విధానంలో నియమిస్తున్నారు. వీరిలో బదిలీల సమయంలో కొంతమందికి బదిలీలు జరగడంతో వారు వెనక్కు వెళ్లిపోవడం ఆ స్థానంలో మరి కొంతమందిని వేయడం సాగుతోంది. సుమారు 30వేలకు పైగా జనాభాతో పాటు 20 వార్డులుగా ఉన్న నెల్లిమర్ల నగర పంచాయతీలో రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో వల్ల ఉన్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న వారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాలూరు నుంచి, అకౌంటెంట్‌ను బొబ్బిలి నుంచి, ఈ1 గుమస్తాను రాజాం నుంచి, జీ1 గుమస్తాను సాలూరు నుంచి, శానిటరీ ఇనస్పెక్టర్‌ను ఆముదాలవలస మునిసిపాలిటీ నుంచి డెప్యుటేషన్‌పై నియమించారు. వీరితో పాటు సుమారు 30 మందికి పైగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారు. రాజకీయ ప్రాబల్యం ఎక్కువ కావడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వీరి వ్యవహార శైలిపై పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో చర్చ కూడా జరిగింది. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో పాలన బాధ్యతగా సాగడం లేదని కౌన్సిలర్లతో పాటు ఉన్న రెగ్యులర్ ఉద్యోగులు సైతం తరచు వాపోతుంటారు.

మునిసిపల్ ఇంజినీర్ పోస్టు ఖాళీ

నగర పంచాయతీలో అభివృద్ధి పనుల నిర్వహణకు అవసరమైన ఇంజినీర్ పోస్టు సంవత్సరాల తరబడి ఇక్కడ ఖాళీగా ఉంది. ఫలితంగా అభివృద్ధి పనులకు అంచనా వ్యయ ప్రణాళికలు(ఎస్టిమేట్) తయారు చేయడం, టెండర్ ప్రకటన వ్యవహారాల నిర్వహణ, కాంట్రాక్టర్లతో పనులు చేయించడం తదితర పనులను పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడు. సంవత్సరాల తరబడి ఇక్కడ మునిసిపల్ ఏఈ నియామకం జరగకపోయినా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో ఈ బాధ్యతలను వార్డు సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఇద్దరిని ఎంపికచేసి వారికి బాధ్యతలు అప్పగించారు. అసలే ఉద్యోగం కొత్త, అనుభవ లోపంతో ఉన్న వారిద్దరికి ఈ బాధ్యతలు ఇబ్బందిగానే ఉన్నాయి.

ప్రభుత్వానికి నివేదించాం

నెల్లిమర్ల నగర పంచాయతీలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఈ కార్యాలయంలో రెండు పోస్టులు తప్ప మిగిలిన వారంతా వేరే ప్రాంతంలో పనిచేస్తున్నవారిని డెప్యూటేషన్ ప్రాతిపదికన నియమించారు. రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలని గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం.

- బాలాజీ ప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్, నెల్లిమర్ల

జగన్ తీరును అసహ్యించుకుంటున్నారు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి: తెలుగుదేశం ప్రభుత్వం పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం ఆయన చీపురుపల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లే గేటు వద్ద మాజీ ముఖ్యమంత్రి ప్రవర్తనను చూసి ప్రజలు సిగ్గుతో తల దించుకుంటున్నారన్నారు. ఢిల్లీలో హడావిడి చేసి, రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన ఉద్దేశమని నాగార్జున ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో విధ్వంసాలు, అరాచకాలు తప్ప రాష్ట్రంలో మరేమీ జరగలేదన్నారు. ఆయన చేసిన తప్పిదాలను సరిదిద్దుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామరస్య పాలన అందిస్తున్నారని చెప్పారు. పోలవరం, రాజధాని నిర్మాణాలపై జగన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదన్నారు. అసెంబ్లీకి వెళ్లడానికి ముఖం చెల్లక నాటకాలాడుతున్నారని నాగార్జున ఎద్దేవా చేశారు.

డాక్యుమెంట్‌ను సరిగా పరిశీలించరేమి?

- రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించిన రావాడ గ్రామస్థులు


సిబ్బందిని ప్రశ్నిస్తున్న రావాడ గ్రామస్థులు

భోగాపురం: తమ పేరు మీద ఉన్న భూమిని వేరే వ్యక్తికి ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారని రావాడ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. అవనాపు పైడినాయుడు పేరు ఎఫ్‌సీవో రికార్డులో ఉండగా అదే భూమి బుత్తల అప్పన్న కొనుక్కున్నాడని, ప్రస్తుతం బుత్తల అప్పన్న మనవుడు అప్పలరాజు భూమిపై ఉన్నాడని, ఈ భూమిని అదే పేరుగల మరోవ్యక్తికి రాసి ఇచ్చేస్తున్నట్లు రైటర్ తప్పుడుగా డాక్యుమెంట్ తయారు చేశారని, దానిని సరి చూసుకోవాల్సిన బాధ్యత లేదా అని నిలదీశారు. రావాడ గ్రామానికి చెందిన మరి కొంతమంది డాక్యుమెంట్‌లను కూడా రైటర్ తప్పుడుగా తయారు చేశారని, వీటిని ఎందుకు గుర్తించలేదని అడిగారు. దీనిపై సిబ్బంది మాట్లాడుతూ సబ్‌రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారని, ఆయన వచ్చాక తప్పుగా రిజిస్ట్రేషన్ చేసుంటే పరిశీలించి రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆందోళనలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ దంతులూరి సూర్యనారాయణరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణ, రావాడ గ్రామస్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

నెల్లిమర్ల: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌లో దివ్యాంగుల రిజర్వేషన్‌పై తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీ డిజేబుల్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ నడిపేన రామారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో దివ్యాంగుల హక్కుల పరిరక్షణతో పాటు వారిలో ఆత్మన్యూనతా భావాన్ని తొలగించేందుకు అవిరళ కృషి చేస్తున్న సీఎస్‌టీ ఐఏఎస్ అకాడమీ ఛైర్‌పర్సన్ బాలలత చేస్తున్న పోరాటానికి తాము మద్దతు ఇస్తున్నట్టు రామారావు తెలిపారు.

ఆక్రమణలపై లోకాయుక్తకు ఫిర్యాదు

బొబ్బిలి: శివడవలస గ్రామంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై లోకాయుక్తలో కేసు నమోదైనట్టు ఆ గ్రామానికి చెందిన డాక్టర్ వెంగళ నారాయణరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులకు దీనికి సబంధించిన అంశాలను వివరించారు. గ్రామంలో గల సర్వే నెంబరు 65లో గల ప్రభుత్వ భూమిలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం నడుస్తున్నాయన్నారు. వీటిని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలు డిజిటల్ లైబ్రరీ, పాల సేకరణ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించినట్టు తెలిపారు. ఈ స్థలాలను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్, ఆర్డీఓలకు అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు లేకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించానన్నారు. ప్రభుత్వ హోమియో ఆసుపత్రి విస్తరణ కోసం కేటాయించిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మరో భూస్వామి ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేశానన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వచ్చి పరిశీలించారని నారాయణరావు తెలిపారు.

హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలి


సీఐకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతంలో ఇటీవల బాలికలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థినులకు గట్టి రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సంఘ నాయకులు కిరణ్, మణికుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం సీఐ నాగేశ్వరరావును విద్యార్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీ హాస్టల్ విద్యార్థినిపై అపరిచిత వ్యక్తి సోమవారం దాడికి ప్రయత్నించాడని, ఆ బాలిక ప్రతిఘటించి హాస్టల్‌లోనికి వెళ్లిపోయిందన్నారు. నిర్మానుష్య ప్రాంతాల లో కొంతమంది దుండగులు మత్తు పదార్థాలు సేవిస్తున్నారని అన్నారు. వారి నుంచి బాలికలకు పెనుముప్పు పొంచి ఉందని తెలిపారు. ఇలాంటి ప్రాంతాలలో పోలీసులు నిఘా పెట్టాలని, ఆకతాయిలు, అసాంఘిక శక్తుల భరతం పట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేశవ, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

రేగిడి: లక్ష్మీపురం ఎంపీపీ పాఠశాలను ఎంఈవోలు వరప్రసాదరావు, ఎరకయ్య మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లల విద్యా ప్రమాణాలు, అభ్యసనా సామర్థ్యాలు, పాఠశాల స్థితిగతులపై హెచ్ఎం మురపాక వెంకటరమణతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్షన్ సభ్యులు ఎందవ సీతానాయుడు, పాలవలస రమేష్ కుమార్, పాలూరి రామకృష్ణ, వంజరాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగావళి తీరం కోత


సంకిలి వద్ద కోతకు గురవుతున్న నదీ తీరం

రేగిడి: నాగావళి తీరంలోని వివిధ గ్రామాల వద్ద గ్రోయిన్స్ లేక నదీ తీరం కోతకు గురవుతోంది. గతంలో ఈ గ్రోయిన్స్ తీరానికి రక్షణగా ఉండేవి. దీంతో కోత ప్రమాదం ఉండేది కాదు. సంకిలి, బొడ్డవలస, రేగిడి, పుర్లి, వెంకటాపురం, చెలిగానవలస, ఖండ్యాం తదితర గ్రామాల్లో గ్రోయిన్స్ కొట్టుకుపోవటంతో ఈ ప్రమాద పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీటి ఆవశ్యకతపై ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు నివేదించినా పరిష్కారం కనిపించడం లేదని రైతు సంఘ ప్రతినిధి నారు జనార్దనరావు ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

బొబ్బిలి: ప్రస్తుత వర్షాకాలంలో అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె చినబజారు, విశ్వబ్రాహ్మణ వీధిలో పర్యటించారు. రోడ్లపై దుకాణాలను నడుపుతున్న వారిని వెంటనే తొలగించాలని అన్నారు. పెదబజారు వరకు కాలువల నిర్మాణాలకు అంచనాలను తయారు చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రేగిడి: సంకిలి పంచాయితీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేస్తున్నారు. మంగళవారం పంచాయితీ సర్పంచ్ బి.పట్టాభి, కార్యదర్శి శైలజ పర్యవేక్షణలో మంగళవారం దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

దత్తిరాజేరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అమరావతి, పోలవరానికి నిధులు కేటాయించి ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రుల అభిమానం చూరగొందన్నారు. విభజన చట్టంలో చాలా అంశాలను నెరవేర్చే దిశగా అడుగులు వేయడం శుభపరిణామం అన్నారు.

అది కూటమి విజయం

రేగిడి: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పెద్దపీట వేయడం కూటమి ప్రభుత్వ విజయమని డీసీసీబీ మాజీ ఛైర్మన్ దూబ ధర్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కిమిడి అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వీరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి సాయం వెనుక సీఎం, డిప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల కృషి ఉందన్నారు.

ఇక మన రాజధాని అమరావతి

కేంద్ర బడ్జెట్ ఎంతో బాగుంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వానికి కేంద్రం బడ్జెట్ లో పెద్దపీట వేయడం హర్షణీయం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్‌కు కృతజ్ఞతలు.

- జీఎస్.నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు, ఎస్.కోట

ఫలించిన చంద్రబాబు, పవన్ కృషి

ఏపీకి మేలుచేసే బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి కనిపిస్తుంది. ఇంతచక్కటి బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలసీతారామన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ముఖ్యంగా రాజధాని అమరావతి, పోలవరంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేయడం చాలా ఆనందంగా ఉంది.

- రాయవరపు చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్.కోట

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

రాజాం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాబ్స్ జిల్లా మేనేజర్ డి మార్టిన్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీసీ చిరంజీవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోగా మండల సమాఖ్యను సంప్రదించాలని సూచించారు 24 ఏళ్ల లోపు యువకులకు సేల్స్‌సూపర్‌వైజర్స్, ప్రొడక్షన్ కెమిస్ట్, జూనియర్ స్టోర్ కీపర్, సెక్యూరిటీ ఆఫీసర్ వంటి ప్రైవేటు ఉద్యోగాలకు విజయనగరంలోని సెంచూరి యన్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని వివరించారు. వివరాలకు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం, మండల సమాఖ్యలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు, డీపీఎంలు రాజ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

శృంగవరపుకోట: రాష్ట్ర స్థాయి అండర్-55 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి సుధారాజు, జాతీయ క్రీడాకారిణి సుధారాజు క్రీడాకారులు రేగలబంద అప్పారావు, పూలబంటి అప్పారావును మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోచ్ పొట్నూరు శ్రీరాములు, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అట్లూరి శ్రీవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుకు హెల్మెట్ తప్పనిసరి


ద్విచక్ర వాహనచోదకులకు అపరాధ రుసుం విధిస్తున్న దృశ్యం

బొండపల్లి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేనిఎడల చర్యలు తప్పవని ఎస్ఐ కె.లక్ష్మణరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల సముదాయం వద్ద జాతీయ రహదారిపై ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించని ప్రయాణికులకు, లైసెన్సు, వాహన పత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. జూన్ 1 నుంచి మైనర్ బైక్ రైడర్లకు రూ.25వేలు జరిమానా విధించేలా రవాణాశాఖ సవరణ తీసుకువచ్చిందని గుర్తు చేశారు. మైనర్లకు ఏ వన్‌గా, వాహన యజమానులను ఏ2గా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనచోదకులు పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గంట్యాడ: వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని విజయనగరం రూరల్ సీఐ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం కొండతామరాపల్లి కూడలిలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపినప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిబంధనలు పాటించాలి


సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భోగాపురం: నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్తేర్‌రాణి సూచించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. రికార్డుల నిర్వాహణ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ తదితర వాటిపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో బీటీనాయుడు, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండగుంపాంలో శిక్షా సప్తాహ్


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: కొండగుంపాం ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన కాగితపు సంచులను ప్రదర్శించారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్‌కు సంబంధించి నిపుణ్ భారత్‌పై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీవో

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస, రాజుల రామచంద్రపురం, నీలకంఠారాజపురం, షికారుగంజి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీవో నాగమణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అపర్ణ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు

శృంగవరపుకోట: మండల కేంద్రంలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం జిల్లాలోని గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాలరావు ఆధ్వర్యంలో ప్రస్తుత వర్షాకాలంలో ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స చేయాల్సిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కనకచారి, ఆనంద్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

సతివాడలో నేత్ర వైద్య శిబిరం

నెల్లిమర్ల: సతివాడ గ్రామంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 56 మంది కళ్లను పరీక్షించుకోగా, 24 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యురాలు అలేఖ్య క్యాంప్ కోఆర్డినేటర్ జోగారావు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నాగమాధవికి పదవిపై హర్షం

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవికి జనసేన పార్టీ చీఫ్ విప్ పదవి లభించడం పట్ల ఆ పార్టీ నాయకుడు ఎంఎం నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే నాగమాధవి సమర్థతకు, వ్యక్తిత్వానికి తగిన గుర్తింపు లభించినట్లయిందని ఆయన పేర్కొన్నారు. ఆమె హుందాతనాన్ని, నాయకత్వ పటిమను గుర్తించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ పదవిని కట్టబెట్టారని అన్నారు.

ఫీజు చెల్లింపునకు 4 వరకు గడువు

నెల్లిమర్ల: డీఈఎల్ఈడీ (డైట్) 2018-20 బ్యాచ్‌లో మొదటి సంవత్సరం పరీక్షలను ఒకసారి తప్పిన వారికి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు ఆగస్టు 4వ తేదీలోగా ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఆగస్టు 19లోగా చెల్లించవచ్చని ఆమె చెప్పారు. జిల్లాలోని ఆ బ్యాచ్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి గడువులోగా ఫీజు చెల్లించాలని ఆమె సూచించారు.

ఆధార్ అప్‌డేట్ సేవలు ప్రారంభం


చిన్నారికి ఆధార్ అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

గంట్యాడ: కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ సేవలు మంగళవారం ప్రారంభించారు. ఆధార్‌కు సంబంధించి ఐదు సంవత్సరాలు లోపు పిల్లలకు అప్‌డేట్, ఫోన్ నెంబరు అనుసంధానం, కొత్త ఆధార్ నమోదు, పేర్లు సవరణ వంటివి చేపట్టారు. మూడు, నాలుగు సచివాలయాల్లో ఈ ఆధార్ అప్‌డేట్ సేవలు నిర్వహించారు.

ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం

ప్రకటన

ఈ వార్తా పత్రికలో 22-06-2024న ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నం జిల్లా కొరకు రూపొందించిన కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్స్ (CZMPs) ముసాయిదా ఫైనలైజేషన్‌కు సంబంధించి సమావేశమందిరం, కలెక్టర్ వారి కార్యాలయం, విశాఖపట్నం వద్ద 24-07-2024న ఉ. 11.00 గం.లకు నిర్వహించవలసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయటమైనది.

స్థలం : విశాఖపట్నం
తేది : 23-07-2024

సం/-
పర్యావరణ ఇంజనీర్
ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం

పురపరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ
నెల్లిమర్ల నగర పంచాయతీ

1. మొత్తం పనులు: 1(ఒకటి)	2.మొత్తం పని అంచనా విలువ: రూ.12.21లక్షలు
1.బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది :	23.07.2024 సమయం:10.00 A.M
2.బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది :	31.07.2024 సమయం:03.30 P.M
3.చివర తేది & సమయం బిడ్ స్వీకరణ కొరకు :	31.07.2024 సమయం:04.00 P.M

Note: Any Addendum/corrigendum/Bid Clarification/ Time Extension shall be issued on the website only NO Separate press notification shall be issued.
తదుపరి వివరముల కొరకు సంప్రదించండి:
https://tender.apeprocurement.gov.in.
Contact: 8520008977

సం/- కమీషనరు,
నెల్లిమర్ల నగరపంచాయతీ.



కరుణ లేకపోయె!

● గత ఐదేళ్లుగా జాడలేని ఉపాధి కల్పన ● అలంకారప్రాయంగా కార్పొరేషన్లు ● నిరుద్యోగుల ఎదురుచూపులు ● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రాజాం, జూలై 23:

● రాజాంకు చెందిన శ్రీనివాసరావు స్వయం ఉపాధి పొందేందుకు కొన్నేళ్ల కిందట బీసీ కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రుణం వస్తే దుకాణం ఏర్పాటుచేసుకోవాలని భావించాడు. ఐదేళ్లు గడిచిపోయినా అతిగతీ లేదు. దీంతో స్థానిక పరిశ్రమలో రోజువారి కూలీగా చేరిపోయాడు.

● రాజాంకు చెందిన మరో యువకుడు పైడిరాజు ఆటో కోసం కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. 2019 ఫిబ్రవరిలో ఇంటర్వ్యూలు సైతం పూర్తయ్యాయి. కానీ రుణం అందలేదు. రుణంపై ఆశలు వదులుకున్న పైడిరాజు ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకున్నాడు.

గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ పాలనలో పరిస్థితి ఇది. రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరయ్యే రాయితీ రుణ పథకాలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ స్తబ్ధత ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 కార్పొరేషన్లు ఉండగా..వైసీపీ ప్రభుత్వం 80కి పెంచింది. సామాజికవర్గానికి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది. చైర్మన్‌తో పాటు సభ్యులను నియమించింది. అంతవరకూ బాగానే ఉంది కానీ ఆయా సామాజికవర్గాల సంక్షేమానికి కానీ..నిరుద్యోగ యువతకు కాని రుణ పథకాలు మాత్రం ప్రకటించడం లేదు. గతంలో సంక్షేమ శాఖలు ప్రకటించే వార్షిక ప్రణాళికల కోసం నిరుద్యోగ యువత ఎరుదుచూసేవారు. వెనుకబడిన తరగతుల వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కులాల వారీ ఏర్పాటు చేసుకునే సంఘాల (ఫెడరేషన్లు)కు 50 శాతం సబ్సిడీతో కూడిన గ్రూపు రుణాలను అందించేవారు. గరిష్టంగా రూ. 30 లక్షల వరకూ మంజూరు చేసేవారు. రాష్ట్రంలో ఏటా అన్ని కార్పొరేషన్ల పరంగా రాయితీతో కూడిన యూనిట్ల ఏర్పాటుకు సగటున రూ.150 కోట్లకుపైగా మంజూరయ్యేవి. 2017- 18 ఆర్థిక సంవత్సరం వరకూ రాయితీ రుణాల మంజూరు ప్రక్రియ సక్రమంగానే సాగింది. 2018-19కి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, తదితర కార్పొరేషన్ల పరంగా రూ.150 కోట్ల రుణ లక్ష్యంగా నిర్ణయించి 11 వేలకు పైగా యూనిట్ల ఏర్పాటు కోసం లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ ముగిసే సమయానికి సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రుణాలు మంజూరు కాలేదు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఆ రుణాల గురించే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

త్వరలో రుణాలు వచ్చే అవకాశం

ప్రభుత్వం ఇటీవలే కొలువుతీరింది. త్వరలో మళ్లీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో రుణాలు ఇచ్చే అవకాశం ఉంది. దీనిపై అధికారికంగా ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

-పెంటారావు, ఏడీ, బీసీ కార్పొరేషన్, విజయనగరం



శాకంబరిగా దాడితల్లి



బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ జంక్షన్‌లో గల శ్రీదాడితల్లి అమ్మ వారికి మంగళవారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి పండ్లు, కూరగాయలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిధుల కేటాయింపుపై హర్షం

లక్కవరపుకోట: అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించిన ఎన్డీఏ ప్రభుత్వానికి మండల టీడీపీ నేతలు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి సాయం, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కి సాయం, వెనుకబడిన జిల్లాల నిధులు ఇలా అన్ని విధాలా సాయం అందిస్తామని ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

కౌలురైతుల రుణాలపై చర్చిస్తున్నాం

లక్కవరపుకోట: ఖరీఫ్‌లో కౌలురైతులకు ఇచ్చిన కార్డులపై బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగావారితో చర్చిస్తున్నామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం కూడా కౌలు రైతుల సాయం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు నిరంతర సేవలు అందించేందుకు రెవెన్యూశాఖ సిద్ధంగా ఉందన్నారు. రైతులకు ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

రేపు నేత్ర పరీక్షలు

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీలో ఈ నెల 25న వైద్యాధికారి పర్యవేక్షణలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య దృష్టి సమస్యలు, కంటి శుక్లాలు ఉన్నవారిని పీహెచ్‌సీకి పంపించాలన్నారు. బీపీ, షుగర్ మందులు వాడుతున్నవారు తప్పనిసరిగా మందులు తీసుకుని రావాలని, ఆపరేషన్లకు ఎంపికైనవారిని వెంటనే పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తామన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

విజయనగరం రింగురోడ్డు: తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గుండాలపేట గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ అజాద్, లోకమాన్య తిలక్‌లకు ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆ చిత్రపటాలకు పూలమాల వేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు మాట్లాడుతూ, దేశ ప్రజలు వీరి త్యాగాలను ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం రింగురోడ్డు: ప్రభుత్వ రంగ సంస్థ కెనారా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ సర్కిల్ కార్యాలయం జనరల్ మేనేజర్ పి.రవి వర్మ కోరారు. మంగళవారం అంబేడ్కర్ కూడలి వద్ద కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు కెనారా బ్యాంకు సేవలు మరింత విస్తృతం చేస్తున్నామన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. ప్రధానంగా మహిళలకు, కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి ముద్ర యోజన తదితర పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం కె.వినోద్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పనిదినాల్లో శిక్షణ వద్దు

బొబ్బిలి: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకింద గల హైస్కూళ్ళ హెచ్‌ఎంలకు పాఠశాల పనిదినాల్లో పదిరోజుల టీచ్ టూల్ శిక్షణ ఇవ్వడం సరికాదని ఏపీటీఎఫ్ నేత బంకురు జోగినాయుడు అభ్యంతరం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫార్మేటివ్ పరీక్షలు జరిగేముందు ఎన్‌ఈపీపై జాతీయ శిక్షా సప్తాహ్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం వ్యర్థమన్నారు. ఇలా మొత్తం 17 రోజులు విద్యార్థుల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. 117 జీవోని రద్దు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాంకర్లు సహకారం అందించాలి

● డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

బొబ్బిలి: ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి బ్యాంకు అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి నూరు శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. కస్టమర్ సర్వీసు కేంద్రాల పనితీరుపై సరైన పర్యవేక్షణ ఉండాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు కలిగిన వారందరికీ బ్యాంకులు రుణాలందించాలని పీడీ తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం నాగార్జున, మెప్మా పీడీ సుధాకర్, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ మజ్జి శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో 40,400 డ్వాక్రా సంఘాలున్నాయని ఆ సభ్యులు తమ రుణవాయిదాల చెల్లింపుల్లో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకత పాటిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘాలకు ఇచ్చిన పేటీఎం యంత్రాల ద్వారా చెల్లింపులు జరుపుకోవాలని నిర్దేశించామన్నారు. ఈ ఏడాది అర్హత సాధించిన 29,180 సంఘాలకు 1357 కోట్ల రుణాలను అందించాలన్నది లక్ష్యమని అందులో ఇంతవరకు 120 కోట్లు రుణవితరణ జరిగిందన్నారు. స్త్రీ నిధి కింద 120 కోట్ల రుణాల లక్ష్యానికి గాను ఇంతవరకు 39. 4 కోట్లు ఇచ్చామన్నారు. జీవనోపాధి కోసం రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా పనిచేస్తున్న సంఘాల ద్వారా షాపింగ్ మాల్స్, కోళ్లఫారాలు, ఫంక్షన్ హాళ్లు వంటివి ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. సంఘాలు చేసుకున్న పొదుపు మొత్తం 600 కోట్ల రూపాయల నిల్వ ఉందన్నారు. ఆ మొత్తంలో తక్కువ వడ్డీకి సభ్యులకు రుణాలిస్తారన్నారు. పీఎంజీఎస్‌వై పథకంలో 1126 మందికి 27.8 కోట్ల రూపాయల రుణాలిచ్చామన్నారు. జిల్లాలో 140 మంది సీసీ లు పనిచేస్తున్నట్లు పీడీ తెలిపారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవరి

అనర్హులకు పింఛన్లపై విచారణ

రామభద్రపురం, జూలై 23: గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు కూడా పింఛన్లు మంజూరు చేశారన్న దానిపై తెలుగుదేశం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. శిష్టు సీతారాంపురం గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి తల్లిదండ్రులకు, వైకల్య శాతం తక్కువ ఉన్నవారికి పింఛన్లు మంజూరు కావడంపై ఈవోపీఆర్‌డీ రమణ, మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమల ప్రసాద్‌లు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పింఛన్లు పొందుతున్న వారి ధ్రువపత్రాలు పరిశీలించి వారి అభిప్రాయాలను నమోదు చేశారు. అర్హులకు మాత్రమే పింఛన్లు ఉండాలని ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ ప్రతినిధి కర్రోతు వెంకన్న తెలిపారు. వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు స్పందించి.. టీడీపీకి చెందిన వారిలో కూడా కొంతమంది అనర్హులు ఉన్నట్టు ఫిర్యాదు చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని విచారణ అధికారులు తెలిపారు. ఈ విచారణలో ఉపసర్పంచ్ కర్రోతు అప్పలనాయుడు, గ్రామ కార్యదర్శి మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న దృశ్యం

పొదుపు సంఘాలకు రూ.114 కోట్ల రుణాలు లక్ష్యం

బొబ్బిలి, జూలై 23: జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2854 స్వయంసహాయక పొదుపు సంఘాలకు రూ.114 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలను అందివ్వాలన్నది లక్ష్యంగా నిర్ణయించినట్లు మెప్మా పీడీ బి.సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది 4,600 గ్రూపులకు 395 కోట్ల రుపాయల రుణాలిచ్చామన్నారు. ఇంత మొత్తంలో ఇస్తున్న రుణాలన్నీ ఏమేరకు సద్వినియోగం అవుతున్నాయన్న దానిపై మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ) ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాల్లో నేరుగా ప్రతి లబ్ధిదారుకీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీస్తామన్నారు. రుణపంపిణీలో ఎటువంటి అవకతవకలు లేకుండా నిఘా పెడుతున్నామన్నారు. బ్యాంకులే నేరుగా సంఘాలతో డాక్యుమెంటేషన్ చేయించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్పీల ప్రమేయం లేకుండా చేశామన్నారు. ప్రతి సంఘానికి 20 లక్షల రూపాయల వరకు రుణం అందజేస్తున్నామన్నారు. రుణాల రికవరీ రేటు 99.7 శాతంగా ఉండడంతో బ్యాంకుల నుంచి రుణవితరణ బాగుందన్నారు. పీఎం స్వనిధి కింద వీధి వ్యాపారులకు మూడు దశల్లో ఒక్కొక్కరికీ పది వేల నుంచి 30 వేలు ఆపైన రుణాలిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలపై 7 శాతం వడ్డీని ప్రభుత్వం రీఎంబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. ఈ విధంగా 14,491 మందికి మూడు కోట్ల రూపాయల రుణాలిచ్చామన్నారు. జిల్లాలోని 8,230 సంఘాలు ఉండగా వాటికి వందకోట్ల రూపాయల కార్పస్ ఫండ్ ఉందని సుధాకర్ వివరించారు. పట్టణ సంఘాలకు కూడా స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.



బి.సుధాకర్, మెప్మా పీడీ

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

తెర్లాం, జూలై 23: మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీ పాఠశాలలో మంగళవారం వైద్యాధికారిణి డి.దివ్యభారతి విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థినులు జ్వరంతో బాధపడుతుండడంతో వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ప్రాథమిక నైపుణ్యాలకు ప్రాధాన్యం

రామభద్రపురం, జూలై 23: విద్యార్థులు అభ్యసన ప్రక్రియలో ప్రాథమిక నైపుణ్యాలైన చదవడం, రాయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నాయుడువలస ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జేసీరాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, బొప్పే రవికుమార్, శివున్నాయుడు, కృష్ణంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వేపాడ గురుకుల పాఠశాల తనిఖీ

వేపాడ: బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలను జిల్లా కో ఆర్డినేటర్ టీఎం ఫ్లొరెన్స్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలకు వచ్చిన ఆమె శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు పరిశీలిస్తున్న ఫ్లొరెన్స్

వరిలో జాగ్రత్తలతో అధిక దిగుబడులు

వేపాడ: చిట్టివానిపాలెం తదితర గ్రామాల్లో సబల, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు వరి సాగులో షోయింగ్ విధానం, దీని లాభాలను రైతులకు వివరించారు. ఖర్చుతో పాటు మహిళలపై పని భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రావణి అన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఓ హేమసుందర్, సీఆర్పీ అర్జున్, రైతులు పాల్గొన్నారు.

రామనారాయణంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రింగురోడ్డు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం రామనారాయణంలోని వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీటీడీ విశ్రాంత పండితులు గణేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద విద్యార్థులు, పండితులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించేందుకు ఐక్య పోరాటాలు

విజయనగరం దాసన్నపేట, జూలై 23: రాజ్యాంగాన్ని రక్షించేందుకు కలిసొచ్చే శక్తులతో ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కేఎల్‌పురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.లక్ష్మి అధ్యక్షతన జిల్లా ప్లీనరీ సమావేశం జరిగింది. జెండాను పార్టీ కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మతోన్మాద విధానాలు ముందుకు తీసుకువెళ్లే చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావచ్చునని జీఓ ఇవ్వడం దీనికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరం, విశాఖ ఉక్కు కోసం ప్రత్యేక నిధులు లేవన్నారు. ఈ సమావేశంలో సీపీఎం ప్రతినిధులు తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి శంకరరావు, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం

విజయనగరం రింగురోడ్డు, జూలై 23: కాలానుగుణ వ్యాధులకు దోమలే ప్రధాన కారణమని, వాటి నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. మంగళవారం కాటవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ఖాళీ టైర్లు, కొబ్బరి చిప్పలు, గుంతలు, ఇళ్లల్లో వాడే ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ ఉంటే దోమలకు కేంద్రాలుగా నిలుస్తాయన్నారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని ఆయన సూచించారు. ఒక వేళ ఎవరైనా అనారోగ్యానికి గురైతే, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తక్షణమే వైద్య సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

9 వాటర్ ప్లాంట్లు సీజ్

రాజాం/రూరల్: రాజాం పట్టణం, మండలం ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 9 వాటర్‌ప్లాంట్లను తహసీల్దారు కృష్ణంరాజు మంగళవారం సీజ్ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు తహసీల్దారు, ఆర్ఐ సాగర్, వీఆర్‌లో బృందం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రమాణాలను పాటించకుండా వాటర్‌ప్లాంట్లను నడుపుతున్నట్లు గుర్తించారు. మున్సిపల్ పట్టణ పరిధిలో గాయత్రి నగర్, వస్త్రపురి కాలనీ, కొండంపేట, డోలపేట, గ్రామీణ ప్రాంతానికి చెందిన రాజయ్యపేట, బొద్దాం, దోసరి, పొగిరి, జీసీ పల్లెలో అక్రమంగా నిర్వహిస్తున్న ప్లాంట్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. వాటర్‌ప్లాంట్ల నిర్వహణకు సంబంధించి ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఈ సమస్యపై అనేక కథనాలు ప్రచురితం కావడం విదితమే. దీనిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి, జూలై 23: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ గౌడు భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బెస్తవీధికి చెందిన పెరుగు వెంకటరమణ(58) స్థానిక ప్రైవేట్ స్కూలులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. వెంకటరమణ తనకుమార్తె వివాహం, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం సుమారు పదిలక్షల రూపాయల అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ తరువాత ఇంటికొచ్చిన కుమారుడు సాయితేజ చూసి కుటుంబసభ్యుల సహకారంతో హుటాహుటిన బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుని భార్య అరుణజ్యోతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పారామెడికల్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లమో పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటాలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారని తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ పాసైయినా వారు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నా యన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 799501 3422, 7680945357 ఫోన్ నెంబర్లలో లేకుంటే రాగోలు వద్ద జెమ్స్ హాస్పిటల్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు





అలంకరణలో అమ్మవారు, హాజరైన భక్తులు

విజయనగరం రూరల్, జూలై 23: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల మల్లెలు, గులాబీ పువ్వులతో అలంకరించారు. వివిధ రకాల పండ్లను నేవేద్యంగా సమర్పించారు. సాయంత్రం చదురుగుడి ప్రాంగణంలో పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్పీని కలిసిన హోంగార్డు అసోయేషన్ ప్రతినిధులు

విజయనగరం క్రైం, జూలై 23: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ వకుల్ జిందాల్‌ను హోంగార్డుల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బంగార్రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కో-ఆపరేటివ్ సొసైటీ, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సుశీల, మహేష్, శంకరరావు, గోపాల్, రమణ తదితరులున్నారు. ● జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్‌ను రో డ్డు సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు, కార్యక్రమాలపై ఎస్పీ వకుల్ జిందాల్ కు వివరించారు. ఎస్పీని కలిసిన వారిలో సైలాడ శ్రీహరిబాబు, తరుణావాంకు శం, కెల్ల ప్రసాద్ తదితరులు ఉన్నారు. ● లోక్‌సత్తా పార్టీ నాయకులు భీశెట్టి బాబ్జీ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను మ ర్యాద పూర్వకంగా కలిశారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితు లకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు, ఖైనీ, గుట్కాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కృష్ణమూర్తి రాజు, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న హోంగార్డులు

యంత్రాలతో లాభం

జామి: నారుయంత్రంతో వరి ఉడుపులతో ఆర్థికంగా లాభంతో పాటు పంట దిగు బడులు పెరుగుతాయని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామరావు అన్నారు. మంగళవారం భీమసింగిలో నారు యంత్రంతో చేసిన ఉడుపులను పరిశీలించారు.



నారుమళ్లను పరిశీలిస్తున్న జేడీ

ఆధార్ సేవల నమోదు కేంద్రం పరిశీలన

రాజాం: మండలంలోని బొద్దాంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఆధార్ నమోదు కోసం వచ్చిన వారికి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, సీరియల్ నమోదు ప్రకారం ఆధార్ కార్డులను పరిశీలించి సవరణలు ఉంటే సరిచేయాలని వారిని గంటల తరబడి కేంద్రాల వద్ద ఉంచవద్దని ఆదేశించారు. అనంతరం ఆగూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు.

లోక్‌సభ స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపిన కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయించినందుకు గాను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం బడ్జెట్ ప్రసంగం అనంతరం పార్లమెంట్ హాలులో స్పీకర్‌ను ఎంపీ కలిశెట్టి ప్రత్యేకంగా కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి నిధులు కేటాయించటంతో ప్రజలంతా ఆనందం వ్యక్తం చేశారని ఇలాగే కేంద్రంనుంచి, రాష్ట్రానికి ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరామన్నారు.